మచ్చుకైనా కనిపించని పచ్చదనం

- నెహ్రూబొమ్మ టూ చిట్టినగర్ రోడ్డులో మొక్క కనపడితే ఒట్టు
- సింగిల్ వాల్‌గా సెంట్రల్ డివైడర్
- మొక్కలు పెట్టేందుకు వీలులేని వైనం
- మార్జిన్లలో మొక్కలు పెరగకుండా బ్రిక్స్
- పచ్చదనం లోపించిందంటున్న జనం



సింగిల్ గోడ నిర్మాణంతో కేటీ రోడ్డుపై కనిపించని పచ్చదనం



పెట్రోల్ బంక్ నుంచి చిట్టినగర్ వరకు కనిపించని చెట్లు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొత్తపేట నెహ్రూ బొమ్మ సెంటర్ టూ చిట్టినగర్ జంక్షన్...ఈ మధ్యలో ఉన్న కేటీ రోడ్డుపై మచ్చుకైనా పచ్చదనం కనిపించడం లేదు. అభివృద్ధి పేరిట కేటీరోడ్డును కాంక్రీట్ జంగిల్‌గా మార్చేశారని భవన యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని నెలల కిందట కేటీ రోడ్డు అభివృద్ధి పేరిట రోడ్డుకు ఇరువైపులా ఉన్న మొక్కలను తొలగించారు. రోడ్డు నిర్మాణం పూర్తయిన కొన్ని నెలల తర్వాత సెంట్రల్ డివైడర్ నిర్మాణం చేశారు. అయితే డివైడర్ మధ్యలో మొక్కలు ఏర్పాటు చేసేలా నిర్మాణం చేపట్టాల్సిన పాలకులు, అందుకు విరుద్ధంగా సింగిల్ వాల్‌ను నిర్మించి మమ అనిపించారు. డివైడర్‌పై మొక్కలు, చెట్లను పెంచేలా నిర్మాణం ఉండాలనే ఆలోచన అధికారులతోపాటు కార్పొరేటర్లకు సైతం రాకపోవడం శోచనీయం

ప్రయాణికులకు అగచాట్లు

చిట్టినగర్ మొదలు నెహ్రూబొమ్మ సెంటర్ వరకు రోడ్డుకు ఇరువైపులా మొత్తం 8 బస్టాప్‌లు ఉన్నాయి. ఎక్కడ కూడా చెట్టు నీడ లేకపోవడంతో బస్సు, ఆటోల కోసం ఎదురు చూసే ప్రయాణికులు రోడ్డుపై ఎండలో నిల్చోవాల్సిన దుస్థితి నెలకొంది. గతంలో ఈ ఆరు బస్టాప్‌ల వద్ద చెట్లు ఉండేవి. రోడ్డు అభివృద్ధి పేరుతో ఆ చెట్లను తొలగించడంతో ఎండైనా.. వానైనా.. రోడ్డుపై నిల్చోక తప్పడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు.

మొక్కలకు చోటేది!..

కేటీ రోడ్డు మార్జిన్లలో మొక్కలు వేసుకునేందుకు కూడా అవకాశం లేకుండా సిమెంట్ బ్రిక్స్ ఏర్పాటు చేయడం గమనార్హం. తంలో కేటీ రోడ్డులోని భవన యజమానులు తమ నివాసాల ఎదుట మొక్కలు, చెట్లను పెంచుకునే అవకాశం ఉండేది. అయితే రోడ్డు అభివృద్ధి చేసిన తర్వాత మొక్కలు పెంచుకునే వీలు లేకుండా చేశారని పలువురు భవన యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కుండీలలో మొక్కలు ఏర్పాటుకు వినతి

పశ్చిమ నియోజకవర్గంలో ఎంతో కీలకమైన చిట్టినగర్ టూ కొత్తపేట కేటీ రోడ్డుపై కనీసం కుండీలను ఏర్పాటు చేసి పూల మొక్కలు, చెట్లను ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. పచ్చదనం పెంచాలంటూ ప్రచారాన్ని ఊదరగొడుతున్న ప్రభుత్వం, కనీసం వందలాది కుటుంబాలు నివాసం ఉండే కేటీరోడ్డుపై ఒక్క మొక్క కూడా లేకుండా చేయడంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు.

ఏరియాకో రూలు...!

పాల ప్రాజెక్టు నుంచి నెహ్రూబొమ్మ సెంటర్ వరకు ఉన్న కేటీ రోడ్డును పరిశీలిస్తే ఒక్కో డివిజన్‌కు ఒక్కో రూలుగా కార్పొరేషన్ అధికారులు వ్యవహరిస్తున్నారు. నెహ్రూబొమ్మ సెంటర్ నుంచి కేబీఎన్ కాలేజీ ఎస్‌బీఐ బ్యాంక్ వరకు గతంలో రోడ్డు మధ్యలో డివైడర్‌పై మొక్కలు ఉండేవి. అయితే వాటిని తొలగించి సింగిల్ వాల్ డివైడర్‌ను నిర్మించడంతో మొక్కల ఏర్పాటు లేకుండా పోయింది. ఇక ఎస్‌బీఐ బ్యాంక్ నుంచి చిట్టినగర్ జంక్షన్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఒక్కటంటే ఒక్క మొక్క , చెట్టు కనిపించదు. ఇక చిట్టినగర్ నుంచి పాల ప్రాజెక్టు వరకు విస్తరించి ఉన్న కేటీ రోడ్డుది మరో పరిస్థితి. చిట్టినగర్ వెంకటేశ్వర స్వామి వారి ఆలయం నుంచి సర్కిల్ కార్యాలయం వరకు రోడ్డు మధ్యలో డివైడర్‌పై మొక్కలు, చెట్లతో పచ్చదనంతో ఎంతో ఆహ్లాదకరంగా కనిపిస్తుంది. ఇక కలరా హాస్పిటల్ నుంచి ఫైర్‌స్టేషన్ వరకు ఉన్న రోడ్డుపై డివైడర్ అడుగుఎత్తులోనే కనిపిస్తుంది. గతంలో డివైడర్‌ను నిర్మించాలని స్థానికులు పలువురు ప్రజా ప్రతినిధులకు సైతం వినతిపత్రాలను అందించారు. కేటీరోడ్డు అభివృద్ధి చేసిన తర్వాత మార్జిన్లలో బ్రిక్స్‌ను ఏర్పాటు చేశారు. అయితే స్థానికులు రోడ్డు మార్జిన్లలో మొక్కలు, చెట్లను పెంచుకునేందుకు వీలుగా ఉండేలా బ్రిక్స్‌ను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న తరుణంలో కేటీరోడ్డులో మొక్కలు, చెట్లను ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

హేతుబద్ధీకరణ ప్రక్రియలో సవరణలు చేయాలి



భవానీపురం(విజయవాడపశ్చిమ): గ్రామ, వార్డ్ సచివాలయ ఉద్యోగుల విషయంలో ప్రభుత్వం చేపట్టిన హేతుబద్ధీకరణ ప్రక్రియలో సవరణలు చేయాల్సిన అవసరం ఉందని ఏపీ సచివాలయ ఉద్యోగ సంక్షేమ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు వేల్పుల అర్లయ్య ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. హేతుబద్ధీకరణ సదుద్దేశ్యంతో చేస్తున్నప్పటికీ అమలు విధానంలో సహేతుకత లోపించిందని ఆరోపించారు. తద్వారా సచివాలయ ఉద్యోగులు అధిక పని, ఒత్తిడికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ఎక్కువ జనాభా కలిగిన (3501ప్లస్) కేటగిరి సీకి చెందిన సచివాలయాలను, వాటి పరిధిలో ఉండే మరొక సచివాలయంతో విలీనం చేయకుండా సింగిల్ క్లస్టర్‌గా మాత్రమే పరిగణించాలని ప్రభుత్వాన్ని కోరారు. హేతుబద్ధీకరణ ప్రక్రియతో దాదాపు 19వేల మంది మిగులు సచివాలయ ఉద్యోగుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. అలాగే 6,500 ఉద్యోగుల కొరతను ఎలా భర్తీ చేస్తారో స్పష్టత ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. గతంలో వివిధ సచివాలయ ఉద్యోగ సంఘాల సమావేశంలోగానీ వినతి పత్రాల రూపంలోగానీ పలు సూచనలు చేసినప్పటికీ వాటిపై ప్రభుత్వం స్పందించలేదని గుర్తుచేశారు. ఆయా అంశాలను సచివాలయశాఖ మంత్రి బాలవీరాంజనేయ స్వామి దృష్టికి తీసుకువెళ్లినా అమలుకు నోచుకోకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఇప్పటికైనా హేతుబద్ధీకరణ అంశంలో మార్పులు చేయాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా

ఉత్సవాలు ప్రారంభం



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పాలప్రాజెక్టు సమీపంలోని శ్రీ హనుమత్ దీక్షా పీఠంలో సోమవారం నుంచి హనుమత్ జయంతి, దీక్ష విరమణ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయప్రాంగణంలోని యాగశాలలో సోమవారం ఉదయం 8 గంటలకు అగ్నిస్థాపన, స్థాపిత దేవతరాధన కార్యక్రమాలను నిర్వహించారు. పీఠాధిపతి శ్రీ దుర్గాప్రసాద్ స్వామిజీ పర్యవేక్షణలో వీరాంజనేయ స్వామి వారికి విశేష పూజలు, సుందరకాండ–మన్యుసూక్త మూలమంత్ర హోమాలు చేశారు. ఉత్సవాల నేపథ్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున హనుమత్ భక్తులు దీక్షలను విరమించేందుకు పీఠానికి తరలిరానున్నారని దుర్గాప్రసాద్ స్వామిజీ తెలిపారు. దీక్షాపరులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఎస్ఎఎస్ కాలేజీ ఆవరణలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆయన వివరించారు.

ఏఈఓలతో సమీక్ష



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడిలో ప్రొటోకాల్ దర్శనాలు, భక్తులకు కల్పిస్తున్న సదుపాయాలపై ఆలయ ఈఓ శీనా నాయక్ సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇంద్రకీలాద్రిపై తన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశానికి ఆలయ ఈఈ కోటేశ్వరరావు, ఏఈవోలు ఎస్. రమేష్‌బాబు,పి. చంద్రశేఖర, జంగం శ్రీనివాసరావులతోపాటు ఇతర ఇంజినీరింగ్ అధికారులు హాజరయ్యారు. అమ్మవారి ఆర్జిత సేవలు, దర్శన ఏర్పాట్లు, భక్తులకు రవాణా సదుపాయాలు తదితర అంశాలపై చర్చించారు. ఇటీవల దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సమావేశంలో చర్చకు వచ్చిన అంశాల గురించి ఏఈవోలకు వివరించారు. భక్తులకు సంతృప్తికరంగా అమ్మవారి దర్శనం ఉండేలా చూసుకోవాలని, ఆలయంలో శానిటేషన్, సెక్యూరిటీ నిర్వహణపై వారికి పలు సూచనలు చేశారు.

అత్త సొమ్ము... మేనల్లుడు తాకట్టు!

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఓ మహిళ తన ఇంట్లో భద్రపరిచిన బంగారపు నగలను ఆమెకు మేనల్లుడు వరస అయ్యే యువకుడు బ్యాంక్‌లో తాకట్టు పెట్టిన ఘటన కొత్తపేట పరిధిలో చోటు చేసుకుంది. ఈ ఘటనపై మేనల్లుడితో పాటు ప్రైవేట్ బ్యాంక్ మేనేజర్‌పై కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. కొత్తపేట మాకినవారి వీధిలో బాకి అప్పలనరసమ్మ, యర్రయ్య నివాసం ఉంటున్నారు. యర్రయ్య ఆటోనడుపుకుని జీవనం సాగిస్తుంటాడు. భార్యభర్తలిద్దరూ కష్టపడి పిల్లల భవిష్యత్తు కోసం సుమారు 15కాసుల పైగా బంగారాన్ని కొనుగోలు చేశారు. లారీ పనులకు వెళ్లే దూరపు బంధువైన కల్లి దుర్గాప్రసాద్‌రెడ్డి కొంతకాలంగా అప్పలనరసమ్మ ఇంటికి వస్తూ ఉన్నాడు. ఈక్రమంలో అప్పలనరసమ్మ ఇంట్లో ఉన్న బంగారం గతేడాది అక్టోబర్‌లో కనిపించలేదు. ఇంట్లో వెతుకుతున్న తరుణంలో ఓ ప్రైవేట్ బ్యాంక్‌కు సంబంధించిన బిల్లులు కనిపించాయి. కల్లి దుర్గాప్రసాద్‌రెడ్డి ఇంట్లో బంగారపు వస్తువులను 2023 సెప్టెంబర్‌లో బ్రహ్మణ వీధిలోని ఓ ప్రైవేట్ బ్యాంక్‌కు తీసుకువెళ్లి తాకట్టు పెట్టినట్లు ఆ రశీదులో ఉంది. దుర్గాప్రసాద్‌ను బంగారం గురించి నిలదీయగా, తాను బ్యాంక్ మేనేజర్‌తో కలిసి తాకట్టు పెట్టుకుని ఆన్‌లైన్‌లో గేమ్స్ ఆడినట్లు తెలిపాడు. దీనిపై బ్యాంక్ మేనేజర్‌ని నిలదీయగా, అతను మీకు దిక్కున్న చోట చెప్పుకోమని చెప్పడంతో చేసేది లేక న్యాయవాదిని ఆశ్రయించారు. బంగారం తాకట్టు పెట్టుకునే క్రమంలో తమ సంతకాలను ఫోర్జరీ చేసినట్లుగా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సోమవారం సదరు బ్యాంకుకు వెళ్లి మేనేజర్‌ను విచారించడం చర్చనీయాంశంగా మారింది.

అత్తింటి వేధింపులపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):వివాహితను వేధింపులకు గురి చేస్తున్న భర్త, ఆడబిడ్డపై కొత్తపేట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట పడాల వారి వీధికి చెందిన పెంటిబోయిన రజనీని వైజాగ్‌కు చెందిన అశోక్‌కు ఇచ్చి 2020లో పెద్దలు వివాహం జరిపించారు. వివాహ సమయంలో రూ. 5 లక్షల కట్నం, ఇతర లాంఛనాలు ఇచ్చారు. ఓమన్‌లోని ఓ సిమెంట్ కంపెనీలో పనిచేసే అశోక్, వివాహమైన నెలరోజులకే ఓమన్ వెళ్లిపోయాడు. ఆ తర్వాత భర్తకు ఆడబిడ్డ వరలక్ష్మి లేనిపోని మాటలు చెప్పి వేధింపులకు గురి చేసేది. 2022లో రజనీ కూడా ఓమన్ వెళ్లింది. అప్పటి నుంచి అశోక్ భార్యను వేధింపులకు గురిచేస్తుండటంతో అదే ఏడాది తిరిగి ఇండియాకు వచ్చింది. రజనీని ఆమెభర్త అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేస్తుండటంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ముడుపుల కోసమే పార్టీ మారారు : వెలంపల్లి



వైఎస్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వెలంపల్లి తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ సీపీకి చెందిన కొంతమంది కార్పొరేటర్లు ముడుపులు దండుకోవడం కోసమే కూటమిలో చేరారని ఆపార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. వైఎస్సార్‌సీపీలో అవినీతికి పాల్పడటానికి అవకాశం లేకనే వారు పార్టీ మారారని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శిగా ఇటీవల నియమితులైన షేక్ బాజీ షాహిద్(బాజీ బాబా)ను పార్టీ నేతలు అన్సారీ–అబ్బాస్ తదితర నాయకుల ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సత్కరించారు.

కార్యక్రమానికి వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. ఈసందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ అబద్ధపు హామీలిచ్చి గద్దెనెక్కిన కూటమి నేతలు రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ రాష్ట్ర ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం చేసే అవినీతి, అక్రమాలపై వైఎస్సార్ సీపీ పోరాడుతూనే ఉంటుందన్నారు.

కోవిడ్ లాంటి క్లిష్ట సమయంలో సైతం మాజీసీఎం వైఎస్ జగన్ ప్రజలకు సంక్షేమ పథకాలు ఇవ్వగా, ప్రస్తుత సీఎం చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా డ్రామాలు ఆడుతున్నారని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది గడుస్తున్నా, పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని దుయ్యబట్టారు.

కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ సెల్ జాయింట్ కార్యదర్శి నజీర్, ఎన్టీఆర్ జిల్లా మైనారిటీ అధ్యక్షులు షేక్ మస్తాన్, 55 డివిజన్ కార్పొరేటర్ శిరంశెట్టి పూర్ణ, పశ్చిమ మైనారిటీ అధ్యక్షులు ఎండి అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఫిర్యాదును క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



నగరవాసుల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం ఆయన ప్రజా ఫిర్యాదులు పరిష్కార వేదిక కార్యక్రమంలో నగరవాసుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను వేగంగా, సమర్థవంతంగా పరిష్కరించడమే వీఎంసీ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఫిర్యాదులపై వెంటనే స్పందించడంతోపాటు, వాటికి శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. ఇందులో మొత్తం 17 ఫిర్యాదులు రాగా పట్టణ ప్రణాళికకు సంబంధించినవి 12, ఇంజినీరింగ్ 3 , రెవెన్యూ 1, వైద్య – ఆరోగ్యం 1 ఫిర్యాదులను స్వీకరించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ప్రాజెక్ట్ డాక్టర్ డీ చంద్రశేఖర్, చీఫ్ సిటీప్లానర్ సంజయ్ రత్నకుమార్, డెప్యూటీ కమిషనర్(రెవెన్యూ) జీ సృజన, ఎస్ఈ పీ సత్యకుమారి, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాల్‌కృష్ణ నాయక్, రీజినల్ ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, డెప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బీ సోమశేఖర్‌రెడ్డి, బయాలజిస్ట్ సూర్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య జీవితం ఆదర్శం



పుస్తకాలను పంపిణీ చేస్తున్న సీహెచ్ బాబూరావు



52వ డివిజన్‌లో నివాళులర్పిస్తున్న నేతలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): భారత కమ్యూనిస్టు యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య జీవితం నేటి తరానికి ఆదర్శమని సీపీఎం రాష్ట్ర నేత సిహెచ్ బాబూరావు అన్నారు. స్థానిక నెహ్రూబొమ్మ సెంటర్‌లో సోమవారం పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా బాబూరావు మాట్లాడుతూ సుందరయ్య యావత్ జీవితం ప్రజాపోరాటాలకు అంకితం చేశారన్నారు. ప్రజాప్రతినిధిగా ఎలా ఉండాలో చూపించిన స్ఫూర్తిప్రదాత సుందరయ్య అని కొనియాడారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాల పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని 51వ పార్టీ డివిజన్ కార్యదర్శి కే.సూరిబాబు నిర్వహించగా పార్టీ ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

52వ డివిజన్‌లో...

స్థానిక సీపీఎం, సీఐటీయు డివిజన శాఖల ఆధ్వర్యంలో పాతబస్తీలోని 52వ డివిజన్ మల్లికార్జునపేటలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు. సీఐటీయూ మున్సిపల్ ఆఫీస్ సీనియర్ నగర కార్యదర్శి సాంబశివరావు, ప్రముఖ న్యాయవాది బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు సంపర శ్రీనివాసరావు, 52వ డివిజన్ కార్పొరేటర్ వి.వెంకటేశ్వరరావు, రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు వీరయ్య పాల్గొని సుందరయ్యకు ఘనంగా నివాళులర్పించారు.

గంగానమ్మ గుడి విస్తరణ వివాదాస్పదం

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక 41వ డివిజన్ పరిధిలోని అవుట్ ఏజెన్సీ ప్రాంతంలో గంగానమ్మ గుడి విస్తరణకు చేపట్టిన చర్యలు వివాదాస్పదంగా మారాయి. ఇటీవల అర్ధరాత్రి దాటిన తరువాత మెయిన్ రోడ్డును పగులకొట్టి పిల్లర్స్ వేసి గుడిని విస్తరించేందుకు కొందరు ప్రయత్నించారు. స్థానికులు కొందరు ఈఘటనపై నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో వారు నాలుగు రోజుల కిందట వచ్చి పిల్లర్ల సామగ్రిని తీసుకెళ్లారని సమాచారం. రోడ్డు వెడల్పును తగ్గించడంతో ఆటోలు, అంబులెన్స్ రాకపోకలకు ఆటంకం కలుగుతుందని స్థానికులు పేర్కొంటున్నారు.స్థానికులు కొందరు సోమవారం మున్సిపల్ కార్పొరేషన్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌లో, కలెక్టరేట్‌లోనూ ఈ విషయంపై వేర్వేరుగా ఫిర్యాదు చేశారు.

ప్రజానాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య



విజయవాడలీగల్: నిస్వార్థ ప్రజానాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య అని ప్రముఖ సినీదర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ పేర్కొన్నారు. కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏకే బాషా అధ్యక్షతన ఆలిండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం బార్ అసోసియేషన్ హాలులో నిర్వహించారు. సుందరయ్య నేటి రాజకీయ నాయకులకు ఆదర్శప్రాయమని భరద్వాజ పేర్కొన్నారు. ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు సుంకర రాజేంద్రప్రసాద్ కామ్రేడ్ సుందరయ్య జీవితాన్ని విద్యార్థులకు పాఠ్యాంశంగా చేర్చాలని కోరారు. లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంపర దుర్గా శ్రీనివాసరావు మాట్లాడుతూ చట్టసభల్లో ప్రజల గురించి ప్రత్యేకంగా చర్చించేవారని పేర్కొన్నారు. బీబీఏ అధ్యక్షుడు ఏకే బాషా మాట్లాడుతూ సుందరయ్య గొప్ప త్యాగజీవి, ప్రజాపక్షపాతి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీబీఏ ప్రధాన కార్యదర్శి కేవీ రంగారావు, ఆలూరి సుధాకర్‌రావు, సీవీ సుబ్రహ్మణ్యేశ్వరరావు, బొమ్మసాని రవి, వీ కోటేశ్వరరావు, సీనియర్ న్యాయవాదులు, గవర్నింగ్ బాడీ సభ్యులు పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుందరయ్య సేవా కేంద్రం ద్వారా కరోనా రోగులకు ప్రత్యేక సెంటర్ ఏర్పాటుచేసి వారికి అంత్యక్రియలు నిర్వహించిన న్యాయవాది ఆవుల వెంకటరావు బృందాన్ని సత్కరించారు.

వేధిస్తున్న భర్తపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భార్యను వేధిస్తున్న భర్తపై కొత్తపేట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. లంబాడీపేట సాయిరాం సెంటర్‌కు చెందిన షేక్ యాస్మిన్, మన్సూర్ భార్యాభర్తలు. వీరికి ప్రేమ వివాహం కాగా ఓ కుమారుడు సంతానం. ఆటో నడుపుకుని జీవనం సాగించే మన్సూర్ కొంత కాలంగా మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని భార్యను వేధింపులకు గురి చేయసాగాడు. అంతేకాకుండా యాస్మిన్ బంగారు నగలను అమ్ముకున్నాడు. భార్యను పుట్టింటికి వెళ్లి రూ.30 వేలు తీసుకురావాలని వేధింపులకు గురి చేస్తుండటంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అగ్నిప్రమాదాల నివారణ చర్యలపై అవగాహన అవసరం

మేయర్ రాయన భాగ్యలక్ష్మి



మాక్‌డ్రిల్‌లో గ్యాస్ సిలిండర్ మంటలను ఆర్పుతున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, మేయర్ భాగ్యలక్ష్మి

పటమట(విజయవాడతూర్పు): అగ్నిప్రమాదం నివారణ చర్యలు ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం అగ్నిమాపక సిబ్బంది అగ్నిప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు, ప్రమాదం జరిగినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయాలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఫైర్ సిబ్బంది సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ అగ్నిప్రమాదం జరిగితే సమయ స్ఫూర్తితో వ్యవహరించాలని, వీఎంసీ రికార్డు కీపర్, సిబ్బందికి ప్రమాదాలను ఎదుర్కొనే అంశాలపై పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలన్నారు. ఈ సందర్భంగా వారితో మాక్ డ్రిల్‌లో మంటలు ఎలా ఆర్పాలో నేర్పించారు. డెప్యూటీ మేయర్లు బెల్లం దుర్గ, అవుతు శ్రీశైలజారెడ్డి, కార్పొరేటర్లు దేవినేని అపర్ణ, వీరమాచినేని లలిత, చెనగిరి రామ్మోహన్, తిరుపతమ్మ, ఏసీ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డీ చంద్రశేఖర, చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి, డీసీ సృజన, ఎస్ఈ(ప్రాజెక్ట్స్) సత్యకుమారి, వీఎంసీ రీజినల్ ఫైర్ ఆఫీసర్ ఎస్.వెంకటేశ్వరరావు, డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ డీ మాల్యాద్రి, ఫైర్ ఆఫీసర్ రాజా, ఎన్టీఆర్ జిల్లా డిస్టిక్ట్ ఫైర్ ఆఫీసర్ శంకర్‌రావు పాల్గొన్నారు.



వర్షపునీరు చేరి అధ్వానంగా ఉన్న జక్కంపూడికాలనీలోని గ్రౌండ్



బస్టాండ్‌లో చేరిన వర్షపు నీరు

వర్షపు నీటి నిల్వతో అవస్థలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఎక్కడికక్కడ వర్షపు నీరు నిలిచిపోవడంతో జక్కంపూడి కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. డ్రైనేజీ సదుపాయం లేకపోవడంతో కాలనీలోని పలుబ్లాకుల ఎదుట వర్షపు నీరు ఎక్కడికక్కడ నీరు నిలిచిపోయింది. మరోవైపు కాలనీలోని గ్రౌండ్, బస్టాండ్ ప్రాంతంలో వర్షపు నీరు నిలిచిపోవడంతో కాలనీవాసులు అవస్థలుపడుతున్నారు.

ఇప్పటికే కాలనీ చుట్టూ ఉన్న పొలాలు, ఖాళీ స్థలాల్లో నిలిచిన మురుగు కారణంగా దోమల ఉధృతికి సాయంత్రం ఆరుగంటలు దాటితే ఇంటిబయట కనీసం నిల్చునే పరిస్థితి కూడా లేకుండాపోయిందని కాలనీవాసులు వాపోతున్నారు. చుట్టుపక్కల ఉన్న మ్యాన్‌హోల్స్ పొంగిపొర్లుతుండటంతో మురుగు నీరంతా గ్రౌండ్‌లోకి చేరుతోంది. బస్టాండ్‌లో మురుగు నీరు చేరి నాచుపట్టడంతో దుర్వాసన వస్తుందని స్థానికులు చెబుతున్నారు. బస్టాండ్‌లో వర్షం నీరు నిల్వ ఉండకుండా కనీసం మట్టితో చదును చేయించాలని పలుమార్లు అధికారులను కోరినా పట్టించుకోలేదంటున్నారు. శానిటేషన్ విభాగం అధికారులు స్పందించి కాలనీలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా తగిన చర్యలు తీసుకోవాలని జక్కంపూడి కాలనీవాసులు కోరుతున్నారు.



బ్లాకుల ఎదుట నిలిచిపోయిన వర్షపు నీరు



పొంగుతున్న మ్యాన్‌హోల్

వైభవంగా శ్రీవారి కల్యాణోత్సవం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. బ్రాహ్మణ వీధిలోని పురాతన ఆలయాల్లో ఒకటైన శ్రీవేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో స్వామివారి జన్మనక్షత్రమైన శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని స్వామివారికి సోమవారం శాంతి కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ ప్రాంగణంలోని శ్రీకృష్ణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులకు ఆలయ అర్చకస్వాములు పీ.రామచంద్రమూర్తి పర్యవేక్షణలో కల్యాణోత్సవాన్ని నిర్వహించారు.భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

వైభవంగా తిరుమంజనం

స్వామివారి జన్మనక్షత్రాన్ని పురస్కరించుకొని ఆలయంలోని స్వామి వారి మూలవిరాట్‌కు తిరుమంజన కార్యక్రమాన్ని వైభవంగా జరిపించారు. పంచామృతాలతో స్వామి వారికి అభిషేకం చేశారు. వైదిక కార్యక్రమాలను కార్యనిర్వహణాధికారి పర్యవేక్షించారు.